క్లుప్తంగా

భూ సమస్యలకు సత్వర పరిష్కారం

• జేసీ కూర్మనాథ్



అధికారులతో మాట్లాడుతున్న జేసీ కూర్మనాథ్

ఇందుకూరుపేట : వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూ రక్ష పథకంతో భూ సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తోందని జాయింట్ కలెక్టర్ ఆర్.కూర్మనాథ్ అన్నారు. మండలంలోని లేబూరు గ్రామంలో జరుగుతున్న రీసర్వేను ఆయన శుక్రవారం పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న రీసర్వేపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. దీనిపై రెవెన్యూ అధికారులకు పలు సూచనలు చేశారు. తొలుత ఆయన స్థానిక గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్బయ్య, ఎంపీడీఓ కల్పన, సర్వేయర్ హరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కళాశాల వార్షికోత్సవం



వార్షికోత్సవంలో పాల్గొన్న అతిథులు

మనుబోలు : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల 22వ వార్షికోత్సవాన్ని శుక్రవారం కళాశాలలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ నాగమణి, కోవూరు, నెల్లూరు, దామరమడుగు, వెంకటాచలం ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాళ్లు సికందర్, గురవయ్య, శ్రీనివాసులు, దీనదయాళ్ అధ్యాపకులు పాల్గొన్నారు.

రేపట్నుంచి గ్రిగ్స్ పోటీలు



నిర్వాహక కమిటీతో మాట్లాడుతున్న కల్యాణ్‌కుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట : నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మండలంలోని నరసాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో 98వ గ్రిగ్ మెమోరియల్ క్రీడా పోటీలు ఆదివారం నుంచి ప్రారంభమవుతాయని నిర్వాహక కమిటీ ప్రతినిధులు ఝాన్సీలత, పల్లవి శుక్రవారం తెలిపారు. కోవూరు జోన్ స్థాయిలో జరిగే క్రీడాపోటీలు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆర్థిక సహకారంతో స్థానిక నాయకులు దువ్వూరు కల్యాణ్‌కుమార్ రెడ్డి సూచనలతో జరుగుతాయని చెప్పారు. మూడు రోజుల పాటు జరిగే పోటీల్లో ఇందుకూరుపేట, కోవూరు, కొడవలూరు, బుచ్చి, విడవలూరు మండలాల్లోని 37 పాఠశాలల నుంచి క్రీడాకారులు పోటీ పడుతారన్నారు. క్రీడాకారులకు భోజన వసతి కల్పిస్తున్నామన్నారు. అనంతరం ఏర్పాట్లను దువ్వూరు కల్యాణ్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షించారు. నిర్వాహణపై కమిటీతో ఆరా తీశారు.

రైతు గ్రూపుల ఏర్పాటుకు కృషి చేయాలి

• ఏఓ లక్ష్మి



రైతులకు సూచనలిస్తున్న ఏఓ లక్ష్మి

కొడవలూరు : మండలంలోని 7 ఆర్బీకేల పరిధిలో సీహెచ్‌సీ(కస్టమ్ హైరింగ్ సెంటర్) గ్రూపులు ఏర్పాటు చేసుకునేలా సలహా మండలి సభ్యులు కృషి చేయాలని ఏఓ లక్ష్మి సూచించారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో మండల ఏఏబీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 16 ఆర్బీకేలుండగా, 9 ఆర్బీకేల పరిధిలో మాత్రమే సీహెచ్‌సీ గ్రూపులు రూపొందించి వ్యవసాయ పరికరాలు పొందినట్లు తెలిపారు. మిగిలిన ఏడు ఆర్బీకేల పరిధిలోనూ ఐదుగురు రైతులతో సీహెచ్‌సీ గ్రూపులు రూపొందించి వ్యవసాయ పరికరాలు పొందేలా సలహా మండలి సభ్యులు చొరవ చూపాలన్నారు. ప్రస్తుతం ట్రాక్టర్‌లు, ట్రాక్టర్‌లకు సంబంధించిన పరికరాలు అందుబాటులో ఉన్నందున గ్రూపులు రూపొందించుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా ప్రతి రైతు పంట నమోదుతో పాటు ఈ–కేవైసీ చేయించుకునేలా కృషి చేయాలని కోరారు. సమావేశంలో మండల వ్యవసాయ సలహా మండలి సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు ఓటమి ఖాయం



కొత్తపాళెంలో మహిళకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న మంత్రి కాకాణి

• రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

తోటపల్లిగూడూరు : రానున్న ఎన్నికల్లో కుప్పం నుంచి పోటీ చేస్తే చంద్రబాబుకు ఓటమి ఖాయమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొత్తపాళెం పంచాయతీలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని శుక్రవారం మంత్రి కాకాణి చేపట్టారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ఇతర అధికారులతో కలిసి మంత్రి కాకాణి గడప గడపకు వెళ్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల బుక్‌లెట్‌ను అందిస్తూ ముందుకు సాగారు. కొన్ని సాంకేతిక కారణాలతో నిలిచిన సమస్యలపై సత్వర పరిష్కారానికి అధికారులను ఆదేశిస్తూ ప్రజలకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్నివర్గాల ప్రజల అవసరాలను గ్రామస్థాయిలోనే తీర్చేలా సచివాలయ, వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చి దేశంలోని అన్నిరాష్ట్రాలకు ఏపీని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శప్రాయంగా నిలిపారన్నారు.

దొడ్డిదారిన సీఎం అయిన వ్యక్తి బాబు

నారా చంద్రబాబునాయుడుకు టీడీపీకి ఎలాంటి సంబంధం లేదని మంత్రి కాకాణి స్పష్టం చేశారు. ఎన్టీ రామారావు కుమార్తెను పెళ్లి చేసుకోవడం, అనంతరం రాజకీయ భిక్షపెట్టిన వ్యక్తినే వంచించి ఆ పార్టీని లాగేసుకోవడం ద్వారా చంద్రబాబు దొడ్డిదారిన ముఖ్యమంత్రి అయ్యాడన్నారు. ఎమ్మెల్యేగా కూడా గెలవలేని నారా లోకేష్ ఎమ్మెల్సీ ద్వారా మంత్రి పదవి పొందాడే తప్ప అతనిపై ప్రజల్లో విశ్వాసం లేదన్నారు. జీఓకి జుఓకు తేడా తెలియని లోకేష్ తన పాదయాత్రలో చేసే ప్రసంగాలతో భారీ నష్టమే తప్పేలా లేదని సొంత పార్టీ నాయకులే చెవులు కొరుక్కొంటున్నారన్నారు. లోకేష్ పాదయాత్ర ద్వారా వైఎస్సార్‌సీపీకి ముచ్చెమటలు పట్టడం లేదని తన నోటి తీరుతో ఎక్కడా కొంపలు ముంచుతాడేమోనని టీడీపీ నేతలకే ముచ్చెమటలు పడుతున్నాయన్నారు. 2024 ఎన్నికల్లో కుప్పంతో సహా 175 స్థానాల్లో విజయం సాధించడమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ముందుకు సాగుతోందన్నారు. అనంతరం కొత్తపాళెం పంచాయతీలో రూ.కోటి నిధులతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి ప్రారంభోత్సవాలను చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి, జిల్లా సంయుక్త కార్యదర్శి ఇసనాక రమేష్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, ఎంపీపీ ఉప్పల స్వర్ణలత, జెడ్పీటీసీ సభ్యురాలు ఎంబేటి శేషమ్మ, నేతలు ప్రసన్నకుమార్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, ఆదిశేషయ్య, డి.గంగాధర్‌రెడ్డి, కె.చంద్రశేఖర్‌రెడ్డి, టి.పద్మనాభరెడ్డి, కె.రంగారెడ్డి, డి.ఏసోబు, టి.సురేంద్రబాబు, కె.సుబ్రహ్మణ్యం, ఎల్.మల్లికార్జున్, ఎ.మధు, వి.శ్రీనివాసులు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులకు మెరుగైన వసతులు



వసతుల గురించి ఆరా తీస్తున్న కార్యదర్శి కాంతిలాల్ దండే

• గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి కాంతిలాల్ దండే

కొడవలూరు: ప్రభుత్వం గిరిజన విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి కాంతిలాల్ దండే తెలిపారు. మండలంలోని చంద్రశేఖరపురంలో ఉన్న గిరిజన గురుకుల పాఠశాల, కళాశాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ గిరిజన విద్యార్థులను విద్యతోపాటు అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని సూచించారు. ఆధునిక బోధనా పద్ధతులు అవలంభించి విద్యా ప్రమాణాలు పెంచాలన్నారు. క్రీడలు, కళా రంగాల్లో తర్ఫీదు ఇవ్వాలని చెప్పారు. గిరిజన గురుకులాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విరివిగా నిధులు మంజూరు చేస్తున్నందున సద్వినియోగం చేసుకుని విద్యార్థులు పోటీ పరీక్షలను సమర్థవంతంగా ఎదుర్కొనేలా కృషి చేయాలని సూచించారు. తొలుత గురుకులంలోని భోజన వసతి, మరుగుదొడ్లు, భవన సదుపాయం తదితరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ మందా రాణి, డీటీడబ్ల్యూఓ పరిమళ, ప్రిన్సిపల్ టి.విష్ణుప్రియ, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు రంగం సిద్ధం



పది పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న టీచర్లు

ముత్తుకూరు : ఏప్రిల్ 3వ తేదీ నుంచి జరగబోయే పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేస్తున్నారు. జెడ్పీ హైస్కూళ్లలో అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక తరగతులు, పరీక్షలు, పురోగామి వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులపై ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. వెనుకపడిన సబ్జెక్టులపై దృష్టి సారిస్తున్నారు. పరీక్షలపై భయం పోగొట్టేందుకు అవగాహన కార్యక్రమాలు జరుపుతున్నారు. ముఖ్యంగా మండలంలోని బ్రహ్మదేవి జెడ్పీ హైస్కూల్ నుంచి 47 మంది, ఎంపీపాళెం జెడ్పీ హైస్కూల్ నుంచి 65 మంది, డమ్మాయపాళెం హైస్కూల్ నుంచి 14 మంది పది పరీక్షలు రాసేందుకు సిద్ధమవుతున్నారు. ఇదే విధంగా ముత్తుకూరు హైస్కూల్ నుంచి 101 మంది, ఈపూరు వెంకనపాళెం నుంచి 34 మంది, కృష్ణపట్నం హైస్కూల్ నుంచి 48 మంది, ముత్తుకూరు గురుకుల పాఠశాల నుంచి 79 మంది పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. అలాగే, పిడతాపోలూరు రత్నం హైస్కూల్ నుంచి 94 మంది, నేలటూరు డీఏవీ స్కూల్ నుంచి 26 మంది, ముత్తుకూరు సీవీఆర్ నుంచి 40 మంది, వీబీఆర్ నుంచి 61 మంది, శ్రీచైతన్య స్కూల్ నుంచి 24 మంది పరీక్షలు రాసేందుకు సిద్ధంగా ఉన్నారు.

పీహెచ్‌సీలను సద్వినియోగం చేసుకోండి

మనుబోలు : ప్రభుత్వ ఆస్పత్రులను సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యురాలు గేయ పూజిత సూచించారు. ప్రధాన మంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్(పీఎంఎస్‌ఎంఏ) కార్యక్రమంలో భాగంగా మనుబోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి నెలా 9 లేదా 10వ తేదీల్లో పీహెచ్‌సీలో గర్భిణులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. హైరిస్క్‌తో ఉన్న గర్భిణులకు గుర్తించి ప్రత్యేక వైద్య సదుపాయాలు కల్పిస్తామన్నారు. మాతా శిశు మరణాలను నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పీహెచ్‌సీల్లో కాన్పులు చేయించుకునేందుకు గర్భిణులు ఎటువంటి సంకోచం పెట్టుకోవాల్సిన అవసరం లేదన్నారు. గర్భిణులు అంగన్‌వాడీల ద్వారా అందించే పోషకాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. ఆకుకూరలు, తాజా పండ్లు, కూరగాయలు, గుడ్లు, పాలను రోజువారీ ఆహారంలో ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాజయ్య, పీహెచ్‌ఎన్ జయశీల, సూపర్‌వైజర్ హైమావతి, స్టాఫ్‌నర్స్ సుజాత, సిబ్బంది రాజన్, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీలో అధికారులు, నాయకులు

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చి నగర పంచాయతీలోని 13వ వార్డులో ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలు, పారిశుద్ధ్యంపై అధికారులు, నాయకులు అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ప్లాస్టిక్‌ను వదలి ప్రత్యామ్నాయ సంచులను వినియోగించాలని కోరారు. బుచ్చిరెడ్డిపాళేన్ని ప్లాస్టిక్ రహితంగా మారుద్దామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్ పుట్టా లక్ష్మీకాంతమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఖాజీగా అబ్దుల్



అబ్దుల్ హయుమ్‌కు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

బుచ్చిరెడ్డిపాళెం : ముస్లింలకు వివాహాలు జరిపే ప్రభుత్వ ఖాజీగా బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన షేక్ అబ్దుల్ హయుమ్‌ను ఎంపిక చేశారు. ఈ మేరకు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నెల్లూరులోని తన నివాసంలో శుక్రవారం అబ్దుల్ హయుమ్‌కు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసన్న మాట్లాడుతూ మైనార్టీ వెల్ఫేర్ డిపార్టుమెంట్ ఖాజీ యాక్ట్ –1880 ప్రకారంగా ముస్లింల వివాహాలు జరిపేందుకు ఖాజీని ఏర్పాటు చేసిందన్నారు. అబ్దుల్ హయుమ్‌ను బుచ్చి టౌన్ ఖాజీగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ నేతలు అల్లాభక్షు, బుచ్చి వైస్ చైర్‌పర్సన్ షాహుల్ తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ క్రీడాకారుడికి అభినందన



విద్యార్థిని అభినందిస్తున్న హెచ్‌ఎం డేవిడ్ తదితరులు

మనుబోలు : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో భాగంగా రాష్ట్రస్థాయిలో జరిగే స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొనేందుకు వెళ్తున్న పదో తరగతి విద్యార్థి వెంకట భార్గవ్‌ను శుక్రవారం హెచ్‌ఎం డేవిడ్, ఉపాధ్యాయులు అభినందించారు. వెంకటభార్గవ్ గతంలో నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొని ప్రతిభచాటి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా భార్గవ్‌ను అభినందించారు. వారి వెంట పేరెంట్స్ కమిటీ కో–ఆప్షన్ మెంబర్ అనమాల ప్రభాకర్‌రెడ్డి, పీడీ కె.సరిత, ఉపాధ్యాయులు ఉన్నారు.

పూడిపర్తిలో భూముల పరిశీలన



భూములకు సంబంధించిన రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ మలోల

వెంకటాచలం : మండలంలోని పూడిపర్తి గ్రామంలో రైతులు సాగు చేసుకునే భూములను ఆర్డీఓ మలోల శుక్రవారం పరిశీలించారు. అర్హులైన రైతులకు ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములు, అలాగే ఏళ్ల తరబడి సాగు చేసుకుంటూ ఎలాంటి హక్కులు లేకుండా ఉన్న భూములకు అసైన్‌మెంట్ పట్టాలు ఇచ్చి రైతులకు హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. అందులో భాగంగా పూడిపర్తి గ్రామంలో అర్హులైన రైతులకు 311 ఎకరాలకు సంబంధించి అసైన్‌మెంట్ పట్టాలు ఇచ్చేందుకు అధికారులు గుర్తించారు. ఈ భూములను ఆర్డీఓ మలోల పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ కృష్ణ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పేదలకు ఉద్యోగాల కల్పనే లక్ష్యం

• ఎస్సై వెంకటరమణ



శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పెంచలయ్య

కొడవలూరు : పేద యువతీ, యువకులకు ఉద్యోగ కల్పనే లక్ష్యంగా శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు ఎస్సై తురకా వెంకటరమణ తెలిపారు. కొడవలూరు మండలం, రామన్నపాళెం ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో తురకా కాంతమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉద్యోగ శిక్షణా కేంద్రాన్ని ఆదిశంకర విద్యాసంస్థల చైర్మన్ వంకి పెంచలయ్య చేతుల మీదుగా శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ తురకా వెంకటరమణ మాట్లాడుతూ పల్లెల్లోని నిరుపేద యువతీ, యువకులకు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా అవసరమైన శిక్షణను ఇస్తున్నట్లు తెలిపారు. ఆదిశంకర విద్యాసంస్థల చైర్మన్ పెంచలయ్య మాట్లాడుతూ ఈ కేంద్రం ఆరంభ సమయానికే 140 మంది వచ్చారంటే గొప్ప విషయమన్నారు.

దళారులకు ధాన్యాన్ని అమ్మొద్దు



మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రసాద్



ముత్తుకూరు : మాట్లాడుతున్న ఏఏబీ చైర్మన్ చెంగారెడ్డి

• రైతులు నష్టపోకుండా కొనుగోలు కేంద్రాలు
• తహసీల్దార్ ప్రసాద్

పొదలకూరు : రైతులు దళారులకు ధాన్యాన్ని అమ్మి నష్టపోకుండా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తహసీల్దార్ ఐఎస్ ప్రసాద్ పేర్కొన్నారు. మండల పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసే మహ్మదాపురం, విరువూరు, సూరాయపాళెం, నావూరు, నేదురుమల్లి, తాటిపర్తి ఆర్బీకేల్లో శుక్రవారం రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు తొందరపడి పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్ముకోవద్దని సూచించారు. రబీ సీజన్లో పండించిన వరిధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందన్నారు. ఉచితంగా గోనె సంచులు, రవాణా చార్జీలు, కూలీల ఖర్చులను భరించనున్నట్లు పేర్కొన్నారు. రైతులు భరిస్తే వారి ఖాతాల్లో చేస్తుందన్నారు. రైతుల నిబంధనల ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా మిల్లులకు తోలుకోవాల్సిందిగా తెలిపారు. కేంద్రాల ద్వారా మిల్లర్లకు తోలేందుకు ఇబ్బందులు తలెత్తకుండా మండల స్థాయి అధికారులతో పాటు, మిల్లు వద్ద కస్టోడియన్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సదస్సుల్లో ఏఓ ఎ.వాసు, సివిల్‌సప్లైస్ డీటీ ఐ.రవి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుపై అవగాహన

ముత్తుకూరు : వరి పంటకు సంబంధించి త్వరలో కోతలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ధాన్యం కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పించాలని మండల వ్యవసాయ సలహా మండలి అభిప్రాయపడింది. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఏఏబీ చైర్మన్ పోచారెడ్డి చెంగారెడ్డి మాట్లాడారు. పలువురు రైతులు తమ అభిప్రాయాలను వ్యవసాయాధికారి జ్యోత్స్నరాణి దృష్టికి తీసుకొచ్చారు. ధాన్యం పచ్చిగా ఉన్నప్పుడు కోతలు కోయకుండా చూడాలన్నారు. తేమ శాతం ఎక్కువ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ధాన్యం నాణ్యత బాగుంటే ఎటువంటి తరుగు లేకుండా గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. ముఖ్యంగా ఎడగారులో చిరుధాన్యాల సాగుపై రైతులు దృష్టి పెట్టే విధంగా అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు. నక్కలకాలువ పూడిక తీయించే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలని నిర్ణయించారు.

దోమల నివారణకు ఫాగింగ్



ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

పొదలకూరు : పట్టణంలో విజృంభిస్తున్న దోమలను నివారించేందుకు పంచాయతీ నిర్వాహకులు శుక్రవారం రాత్రి నుంచి ప్రాంతాల వారీగా ఫాగింగ్‌ను చేపట్టారు. ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, పంచాయతీ సెక్రటరీ ఎస్‌కే అల్లాభక్షు పర్యవేక్షణలో ముందుగా రామనగర్‌గేటు సెంటర్ ప్రాంతంలో ఫాగింగ్‌ను ప్రారంభించారు. పట్టణంలోని అన్ని వీధుల్లో ఫాగింగ్ చేపట్టి దోమలను నివారిస్తామని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఆదాలను కలిసిన బుచ్చి నేతలు

బుచ్చిరెడ్డిపాళెం : నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని బుచ్చిరెడ్డిపాళెం వైఎస్సార్‌సీపీ నేతలు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నెల్లూరులోని ఎంపీ నివాసంలో కలిసి శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలతో అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు చెర్లో సతీష్‌రెడ్డి, నాయకులు యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, మోర్ల మురళీ, చీర్ల ప్రసాద్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు) : గంజి ఒంటి మీద పడడంతో ఓ వ్యక్తి తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఎస్సై ఆంజనేయులు కథనం మేరకు.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన గోపాల్ చంద్ర హల్దార్(52) అనే వ్యక్తి మండలంలోని ముదివర్తి గ్రామ సమీపంలో రొయ్యల గుంత వద్ద కాపలాదారుడిగా పని చేస్తున్నాడు. మూడు రోజుల క్రితం భోజనం తయారు చేస్తుండగా గంజి ప్రమాదవశాత్తు గోపాల్‌చంద్ర హల్దార్ ఒంటి మీద పడి దాదాపు 60 శాతం శరీరం కాలిపోయింది. దీంతో అతన్ని చికిత్స నిమిత్తం చెన్నైలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పశువైద్య సేవలు అభినందనీయం



రూ.30 వేల చెక్కును అందజేస్తున్న వైద్యుడు శ్రీనివాసులునాయుడు

వెంకటాచలం : మండవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందిస్తున్న పశు వైద్యసేవలు అభినందనీయమని పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని శ్రీరామపురం, కంటేపల్లి గ్రామాల్లో శుక్రవారం మండవ ఫౌండేషన్, గోకుల్ మిషన్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో పెయ్యదూడల ఉత్పత్తి పథకాన్ని ప్రారంభించారు. దీని ద్వారా శ్రీరామపురం, కంటేపల్లి గ్రామాల్లో 60 పశువులకు సార్టెడ్ సెమన్ ద్వారా కృత్రిమ గర్భోత్పత్తి చేసేందుకు రూ.30 వేల చెక్‌ను ఫౌండేషన్ తరఫున డాక్టర్ శ్రీనివాసులు నాయుడు చైర్మన్ విజయ్‌కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటాచలం కేంద్రంగా మండవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్నో ఏళ్ల నుంచి ఉచిత పశు వైద్యసేవలు అందిస్తుండటం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో పశుగణాభివృద్ధి సంస్థ ముఖ్యకార్యదర్శి డాక్టర్ సోమయ్య, మనుబోలు ఏడీఏ డాక్టర్ గురువారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాహనాల వివరాలు తెలియజేయాలి



వాహనాల డ్రైవర్ల వద్ద రికార్డులు పరిశీలిస్తున్న బాలమురళీకృష్ణ

ఇందుకూరుపేట : పాత వాహనాలు పాడై వినియోగించకున్నా, ప్రస్తుతం లేకపోయినా వాటి యజమానులు తగిన వివరాలతో ఆర్టీఓ కార్యాలయంలో తెలియజేయాలని మోటార్ వెహికల్ అధికారి బాల మురళీకృష్ణ సూచించారు. మండలంలో శుక్రవారం ఆయన వాహనాలను తనిఖీ చేశారు. రికార్డులు, లైసెన్స్‌లు లేనివారికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనాలకు సంబంధించిన ట్యాక్స్ సకాలంలో చెల్లించాలన్నారు. పాడైన వాహనాల వివరాలు తెలపకపోతే వాటికి సంబంధించి అదనపు ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుందని బాలమురళీకృష్ణ తెలిపారు.